# పొడి నీళ్లు

చిన్నప్పుడు మా అమ్మమ్మ వాళ్ల ఊరు వెళ్ళడానికి ఎంతో ఇష్టపడేవాడిని. చాలా పెద్ద ఇంట్లో అమ్మమ్మా, తాతయ్యే ఉండేవారు. ఇంటిచుట్టూ పెద్ద తోట ఉండేది. ఎన్నో రకాల చెట్లూ, పూల మొక్కలు ఉండేవి. అమ్మమ్మ ఎంతో ఓపికగా తోటను చూసుకునేది. తాతయ్య ఎప్పుడోగాని అమ్మమ్మకు సహాయం చేసేవాడు కాదు.

ఒకప్పుడు తాతయ్యకు యాభయి ఎకరాల వరకు పొలం ఉండేది. సొంత బంధువుల చేతుల్లోనే మోసపోయి అంతా పోగొట్టుకున్నాడు. ఆ ఇల్లు, తోటమటుకు మిగిలాయి. బంధువులు దూరమయ్యారు. అంతెందుకు? అమ్మ అమ్మమ్మతో మాట్లాడదు. ఎందుకో నాకు తెలియదు. అమ్మమ్మ దగ్గరున్నంత చనువు నాకు అమ్మ దగ్గర లేదు. అమ్మను ఏది అడగాలన్నా భయపడుతుంటాను. నేను సెలవుల్లో అమ్మమ్మ దగ్గరకు వెళ్ళడం అమ్మకు ఇష్టం లేదు. మా ఇంట్లోనే నేను కొత్త వాడిలా అనిపిస్తూ ఉంటాను.

అప్పట్లో అమ్మమ్మ వాళ్ళ ఊరు వెళ్ళాలంటే గంట ప్రయాణం చేశాక బస్సు దిగి ఇరవయి నిమిషాలపాటు నదిమీద బల్లకట్టు ప్రయాణం చేయాల్సి వచ్చేది. బల్లకట్టు ప్రయాణం భయంగా ఉండేది. అయినా మొండిగా ప్రయాణం చేసేవాడిని.

వంతెన కట్టాక కట్టకు అటు పక్క ఇటుపక్క రోడ్డు చాలా ఎత్తుగా లేపారు. వంతెన వేసిన తర్వాత అమ్మమ్మ వాళ్ళ ఊరుకు ఎర్రబస్సులు వెళ్ళడం మొదలెట్టడంతో ప్రయాణ సౌకర్యం ఏర్పడింది. ఎర్రబస్సులకు ఎద్లు భయపడుతుండేవి. బండ్లవాళ్ళు బళ్ళను బస్సులకు దూరంగా ఉంచేవాళ్ళు.

ఒకసారి నేనెక్కిన బస్సు వంతెన మూడు వంతులు దాటింది. మిగిలిన కొద్దిగా దాటేస్తే అమ్మమ్మ వాళ్ళ ఊరు వచ్చేస్తుంది. ఎంత మెల్లగా నడిచినా పదినిమిషాల ప్రయాణం ఉంటుంది. డ్రయివరు హఠాత్తుగా బస్సు ఆపేసరికి నా నుదురు ముందరి సీటు కమ్మీకి తగిలింది. పెద్ద దెబ్బేం తగలలేదు. బొప్పి కట్టింది. డ్రయివరు అంత హఠాత్తుగా బస్సును ఎందుకు ఆపేశాడో ముందు నాకు అర్థం కాలేదు.

మా బస్సు ముందు ఒక వయసుమళ్ళిన ఆమె చేతులు జోడించి డ్రయివరుకు నమస్కారం చేస్తూ, "బాబూ, కొద్దిసేపు బస్సు నిలుపయ్యా, మా వాడి బండి ఎద్దులు

బెదురుతున్నాయి... ఏదయినా జరిగితే మావాడు బండితోపాటు కింద పడిపోతాడయ్యా..." అని బతిమలాడుతోంటే, "నువ్వు చెప్పేవరకు బస్సును కదపనమ్మా...." అని ఇంజను ఆఫ్ చేశాడు.

ముసలామె బండిముందు నిలబడి కదలకుండా నిలబడిన కుర్రాడి వయిపు నడుస్తూ "అరే, యాకోబూ, జాగ్రత్తరా నాయనా.... బండి వెనక్కి మళ్లించు..." అంది.

ఆ కుర్రాడికి మహా ఉంటే ఇరవయి మూడేళ్ళు ఉండొచ్చు. బలంగానే ఉన్నాడు. బండి మీద వడ్లబస్తాలు ఎత్తుగా ఉన్నాయి. బండి రోడ్డు ఎక్కి వంతెన చివరి వరకు వచ్చింది. అడుగు పక్కకి జరిగితే కింద పడిపోతుంది. కిందంతా గ్రానేటు రాళ్ళు. వాటిని సరిగా అమర్చి పెట్టలేదు. బండితో సహా అతను పడిపోతే ఏమన్నా ఉందా...? ఆలోచించడానికే భయం వేస్తోంది. ఆ వెనకాల మరో మూడు బళ్లు ఉన్నాయి. మా బస్సు వెనకాల రెండు జీపులు కాస్త దూరంలో మరో రెండు ఎర్రబస్సులు ఉన్నాయి. చాలామంది బస్సులు దిగి దూరంగా నిలబడి చూస్తున్నారు. దగ్గరకు వెళ్ళడానికి ఎవరు ధయిర్యం చేయడం లేదు. ముసలామె అందరినీ బతిమలాడుతోంది. ఏమి చేయాలో ఎవరికి అర్థం కానట్టుగా ఉంది.

యాకోబు బండిని వెనకకు మళ్ళించలేక పోతున్నాడు. ఎడ్లు అతని మాటలు వినడం లేదు. రెండు మూడు అడుగులు వెనక్కి వేస్తున్నాయి కాని వెనకకు తిరగడం లేదు. మా బస్సు డ్రయివరు అరగంట పయిగానే ఆగాడు. అతనికి విసుగేస్తున్నట్టు ఉంది. మా బస్సు వెనక మరికొన్ని బస్సులు చేరాయి. రాకపోకలు స్తంభించాయి. యాకోబు బండి అక్కడే నిలబడిపోయింది. మా బస్సు డ్రయివరు ఇంజను ఆన్‌చేసి రెండడుగులు ముందుకు నడిపి ఇంజను ఆపాడు. స్లోప్‌లో ఉండడాన బండినెమ్మదిగా శబ్దం లేకుండా కదలి యాకోబు బండిని దాటించాడో లేదో పెళపెళమన్న చప్పుడు వెనకాలే ఆక్రందనలు వినిపించాయి. బస్సు ఆగలేదు. ముందుకు వచ్చేయడంతో చూడడం వీలు పడలేదు. ముసలమ్మను కూడా చూడలేకపోయాను.

బస్టాండులో బస్సు దిగగానే అమ్మమ్మ వాళ్ళింటికి పరుగెత్తుకుంటూ చేరుకుని జరిగిన సంఘటన చెప్పాను. ఆమె నమ్మలేదు. తల అడ్డంగా ఆడించింది. చాలా విషయాలు నేను ఊహిస్తూ ఉంటుంటానని ఆమె అనుకుంటూ ఉంటుంది. 'అలా అని మూడు నాలుగు సార్లు అంది కూడా. ఆమెకు చావు కబుర్లంటే ఇష్టం లేదు. అయిదారేళ్ళ కిందట మా చిన్న మామయ్య సయికిలు మీద ఇంటికి వస్తోంటే పుచ్చిపోయిన చెట్టు ఆయన మీద పడి అక్కడికక్కడే చనిపోయాడు. మాలో

మొట్టమొదటిగా డాక్టరు చదువుకుంది ఆయనే. రాజమండ్రి మిషన్ ఆసుపత్రిలో పనిచేస్తుండేవాడు. అప్పటికి ఆయన పెళ్లయి ఎనిమిది నెలలయి ఉంటుందేమో. అతని భార్య గర్భవతి. ఒక బాబు పుట్టాడని విన్నాం. ఇప్పుడు వాళ్ళు ఎక్కడ ఉంటున్నారో నాకు తెలియదు. మూడు నాలుగుసార్లు అమ్మమ్మను అడిగినా చెప్పలేదు. 'నీకుందుకురా ఆ సంగతులన్నీ' అని మందలించింది. ఆ విషయం తర్వాత ఎప్పుడూ ఎత్తలేదు.

ఆ మధ్యాహ్నం, రాత్రి సరిగా భోజనం చేయలేకపోయాను. అరుగుమీద పరుపు వేసుకుని పడుకున్నానన్నమాటే కాని నిద్రపట్టలేదు. మాటి మాటికి బండి కదలకుండా పట్టుకున్న యాకోబే గుర్తు వచ్చాడు. 'అతను చనిపోయి ఉంటాడా?' అని పదే పదే నన్ను నేను ప్రశ్నించుకున్నాను. ఆ మరుసటిరోజు ఎవరిని అడగాలా అని ఆలోచిస్తుంటే అమ్మమ్మ వచ్చి నా పక్కన కూర్చుంది. నా వీపు నిమురుతూ,

"నిద్రపట్టడం లేదా?" అడిగింది.

లేచి కూర్చుని, "లేదు" అన్నాను.

"ఒక కథ చెప్పేదా?"

"ఊ".

"ఈ కథ నాకెవరో చెప్పారు. నీకు కథలంటే ఇష్టం కాబట్టి నీకు చెపుతున్నాను. ఒక ఊళ్ళో ఒక చెరువు అంచున కొన్ని కప్పలు ఉంటుండేవి. వర్షాలు సరిగా పడక పోవడం వలన చెరువు ఎండిపోవడం మొదలెట్టింది. కప్పలు ఒక్కొక్కటి నీళ్ళున్న చోటుకు వెళ్ళిపోవటం మొదలెట్టాయి. అయిదు మటుకు మిగిలాయి. అన్నీ కలిసి వెళ్దామనుకుని ఒక ఉదయం అక్కడికి దగ్గరలో నీళ్లున్న మరో చెరువుకు బయల్దేరాయి. పాత చెరువుకు, కొత్త చెరువుకు మధ్య ఒక నుయ్యి ఉంది. ముందు మూడు కప్పలు నూతిని చూసుకుని నూతిలో పడకుండా జాగ్రత్తగా దూకాయి. అజాగ్రత్త వలన ఒకటి మటుకు బావిలో పడిపోయింది. అది అందులోనే ఉండిపోతుంది. పయికి రాలేదు. జీవితాంతం అందులోనే ఉండిపోతుంది. అయిదో కప్ప మటుకు ఉత్సాహంతో దూకుతూ వస్తోంటే అవతల చేరిన మూడు కప్పలూ "నువ్వురాకు. మధ్యలో బావి ఉంది. పడిపోతావు..' అని గొంతు చించుకుని అరుస్తున్నా అది వేగంగా వచ్చి మూడు కప్పలను చేరుకుంది. 'మేం రావద్దు, రావద్దని అంతగా అరుస్తూ ఉంటే ఎందుకు తొందరపడి వచ్చావు? కొద్దిలో ప్రమాదం తప్పించుకున్నావు. మధ్యలో నుయ్యి ఉంది...' అని అరుస్తూ మందలించాయి. ఆయాసం తగ్గాక ఆ కప్ప అంది, 'మీరలా అరుస్తోంటే నన్ను త్వరగా రమ్మంటున్నారని అనుకున్నాను. నాకు చెవుడు. మీ మాటలు నాకు స్పష్టంగా వినబడలేదు.'

ఆ కథను నేను ఇప్పటికీ మర్చిపోలేదు. యాకోబునూ మర్చిపోలేదు. అమ్మమ్మ చనిపోయాక ఆ ఊరితో సంబంధం తెగిపోయింది. తాతయ్య ఒక్కడే ఉండేవాడు. ఎప్పుడయినా వెళ్ళి చూసివద్దామనిపించేది. వీలు కుదిరేది కాదు. తాతయ్య చనిపోయిన మూడు రోజుల తర్వాత గాని మాకు వార్త అందలేదు.

ఆ తర్వాతే నాకు పుస్తకాలంటే ఆసక్తి మొదలయింది. ఏ కొద్ది సమయం దొరికినా గ్రంథాలయాల్లో గడపడం మొదలెట్టాను. సాహిత్యంతో పాటు మాటకారితనం అబ్బింది. చదువులో అట్టే రాణించలేకపోయాను. అమ్మ నాకు ప్రేమించడం నేర్పింది. నాన్న నాకు దక్షత నేర్పాడు. అన్నయ్య నుండి నేనేమీ నేర్చుకోలేకపోయాను. అతను చాలా తెలివయినవాడు. నా ప్రతి చిన్న తప్పునూ అందరి ముందూ ఎత్తి చూపి ఎద్దేవా చేసేవాడు. నాలో ఆత్మన్యూనతా భావానికి అతనే కారకుడు. బందీని అయిపోయాను.

డిగ్రీ పూర్తి చేసిన సంవత్సరానికి ప్రభుత్వ ఉద్యోగం మా ఊళ్లోనే దొరికింది. స్వతహాగా అందరితో మంచిగా ఉండాలనే మనస్తత్వం నాది. అక్కడే తప్పు అంచనా వేయబడ్డాననుకుంటాను. అందరితో మంచిగా ఉండడం వలన ఒంటరిగా మిగిలిపోతానని ఊహించలేదు. ఆఫీసు పనిలో ఎవరయినా వెనకబడితే వాళ్ళకు తోడుగా కూర్చొని సహాయం చేయడం వలన కావాలని వాళ్ళ పనులు నాకు అప్పగించి బయట తిరిగి వస్తుండేవాళ్లు. అర్థం అయ్యాక సహాయం చేయడం మానేశాను. ఉదయం సెక్షనులో ప్రవేశించగానే అందరినీ పేరు పేరునా పలకరించి శుభోదయం చెప్పేవాడిని. రెండు రోజుల పాటు చెప్పకుండా ఉంటే ఎలా ఉంటుందని ఎవరికీ చెప్పలేదు. నాకు ఎవరూ చెప్పలేదు. బొత్తిగా అనుకోని విషయం. తర్వాత ఎవరినీ విష్ చేయలేదు. పలకరిస్తే పలికేవాడిని.

అన్నిటికన్నా ఒక విషయం మటుకు నన్ను పూర్తిగా మార్చేసింది. సెక్షనులో మా దీక్షితులను కలవడానికి ఎవరో పార్టీవస్తే, నన్ను పిలిచి, 'అరె లింగయ్యా, కేంటీన్‌కు వెళ్ళి, ఏమనుకోకపోతే మాకు కాఫీ తెచ్చిపెడతావూ?' అడిగాడు. నాకు వళ్ళు మండింది. వాడు నాకన్నా జూనియరు. వచ్చిన పార్టీ ముందు పెత్తనం చెలాయించాలని ! 'పోయి తెచ్చుకోరా వెధవా' అన్నాను గట్టిగా. వాడి ముఖం కందగడ్డలా అయింది. ఆ దెబ్బతో మిగిలిన వాళ్ళు దారిలోకి వచ్చారు.

ఈ మధ్యలో అనుకోకుండా అప్పుడప్పుడు మా ఆఫీసులో గెట్ టుగెదర్‌తో మొదలయిన నా హాస్యం బయటకు పాకింది. చాలా కార్యక్రమాలకు నన్ను ఆహ్వానించి

ఆవరించడం మొదలెట్టారు. ఆర్థిక లాభం చేకూరసాగింది. హాస్య సంఘటనలతో ప్రేక్షకులను అలరించాయి. మిమిక్రీ చేసేవాడిని కాదు. ఎవరి మీదా విమర్శలు చేసేవాడిని కాదు. వెంట్రిలాక్విజం ఉండేది కాదు. చిన్న చిన్న విషయాలను అప్పటికప్పుడు కూర్చి ప్రేక్షకులను నవ్వులతో నింపేసేవాడిని. అరగంట కంటే ఎక్కువ తీసుకునేవాడిని కాదు. స్టేజి దిగగానే మామూలు మనిషయి పోయేవాడిని.

పెళ్ళయిన కొత్తలో నా భార్య అప్పుడప్పుడు నాతో అనేది, "మీరెందుకు ఎప్పుడూ సీరియస్‌గా ఉంటారు? నవ్వుతూ ఉండండి".

"అందరినీ నవ్విస్తూండాలి కదా?" అన్నాను.

"నేనన్నది మీసంగతి. అందరినీ నవ్వించేప్పుడు మీరు సీరియస్‌గానే ఉంటారు."

"నాకులా నాలుగు మాటలు చెప్పు, నవ్వుతాను."

"నేను మీలా మాట్లాడలేను."

"నా ఒంటరితనంలోంచి బయటకు రావడానికి అలా మాట్లాడతాను."

"రికార్డు ప్లేయరులో మీ మాటలు రికార్డు చేద్దామనుకుందామని చాలాసార్లు అనుకున్నాను. ఏదో అవాంతరం వస్తుంటుంది. ఆగిపోతుంటాను" అంది. ఆగి, "ఎంతో మందిని పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వించే మీరు పెద్దగా, విరగబడేంతలా నవ్వుతోంటే వినాలని ఉంది, నిజం" అంది.

ఏదో అనబోయి ఆగాను. యాకోబు నిజంగా చనిపోయి ఉంటాడా? అయిదో కప్ప నిజంగా చెవిటిదా?

నా భార్య చేతులు నా చేతుల్లోకి తీసుకున్నాను. ఆ రాత్రి ఆమె నాకు కొత్తగా కనిపిస్తోంది.

"నిజం చెప్పేదా?" అన్నాను.

"ఊ".

"నా మాటలు కాని, నా నవ్వు కాని నేనింత వరకు వినవే లేదు".

ఆమె పెద్దగా నవ్వింది. జీవితం విరబూసి నట్టనిపించింది. తనంత చక్కగా నవ్వగలదని నేను ఊహించలేదు. జీవితాన్ని నా పక్క నుంచుకుని ఎందుకోసం తాపత్రయపడ్డాను? నాలోంచి బయటకు వచ్చి ఎదుటివాళ్ళు కళ్ళల్లోంచి నన్ను నేను చూసుకోవడం ప్రారంభించాలి, ఆమెను నాకు మరింత దగ్గరగా తీసుకున్నాను. ఇహ నేనేమీ పోగొట్టుకోదల్చుకోలేదు.

* ఆదివారం వార్త, 2011